సాక్షి సూర్యాపేట

శుక్రవారం ၊ 9 ၊ ఫిబ్రవరి ၊ 2024



హైవే వెంట డీజిల్ దొంగలు

హైవే వెంట డీజిల్ దొండల బెడద అధికమైంది. నిలిపి ఉన్న లారీల నుంచి డీజిల్ అపహరిస్తున్నారు.

- 8లో



రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

చలకుర్తి నవోదయలో 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

- 8లో



చేనేతపై నిఫ్ట్ విద్యార్థుల అధ్యయనం

చేనేతపై అధ్యయనం నిమిత్తం గురువారం హైదరాబాద్‌లోని నిఫ్ట్ విద్యార్థుల బృందం భూదాన్‌పోచంపల్లిని సందర్శించింది.

- 10లో

న్యూస్‌రీల్

క్యాంపులో కోదాడ మున్సిపల్ కౌన్సిలర్లు

కోదాడ: ఈ నెల 10న జరగనున్న కోదాడ మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ ఎన్నికను పురస్కరించుకొని కౌన్సిలర్లను గురువారం కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ విహారయాత్రకు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఏపీలోని బాపట్ల వద్ద రిసార్ట్స్‌కు కౌన్సిలర్లను తరలించినట్లు సమాచారం. ఈ నెల 10న ఉదయం కౌన్సిలర్లు అక్కడి నుంచి నేరుగా ఎన్నిక జరిగే సమయానికి మున్సిపాలిటీ కార్యాలయానికి రానున్నట్లు తెలిసింది.

అధికారులు అందుబాటులో ఉండాలి



ఐలాపురంలో మహిళతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

చివ్వెంల(సూర్యాపేట) : గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక సూచించారు. చివ్వెంల మండలం ఐలాపురం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. అధికారులు గ్రామాల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయించి, వీధుల్లో చెత్తా చెదారం తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను బ్లీచింగ్ ఫౌడర్‌తో శుభ్రం చేయించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీఓ గోపి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : బెస్ట్ అవైలబుల్ పథకం కింద జిల్లాలోని ఇంగ్లిష్ మీడియం ప్రైవేట్ పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి దయానందరాణి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 సంవత్సరానికి 1వ తరగతి (డే–స్కాలర్), 5వ తరగతి (రెసిడెన్షియల్)లో ఎస్సీ విద్యార్థులను చేర్పించడానికి ఒకటి నుంచి పదో తరగతి వరకు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఈ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రారంభం నుంచి ప్రభుత్వ గుర్తింపు పొంది, గత 5 ఏళ్ల నుంచి 10వ తరగతిలో 90శాతం ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. 50 శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత కలిగిన స్కూళ్లకు అవకాశం ఉందని తెలిపారు.

లబ్ధిదారుల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి



సింగారెడ్డిపాలెంలో యాప్‌లో నమోదును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సురేష్

పెన్‌పహాడ్: ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో అధికారులు జాగ్రత్తలు పాటించాలని జెడ్పీ సీఈఓ సురేష్ సూచించారు. రూ.500లకు అందించే గ్యాస్ కోసం సింగారెడ్డిపాలెంలో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న కొంతమంది గ్యాస్ కన్జ్యూమర్ నంబర్ వేయలేదు. దీంతో ప్రత్యేక యాప్‌ద్వారా పంచాయతీ కార్యదర్శులు ఆ నంబర్ వేస్తున్న ప్రక్రియను గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అఖిల్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి




మాట్లాడుతున్న రాజేష్ మీనా

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా అన్నారు. గురువారం సూర్యాపేటలోని నారాయణ జూనియర్ కళాశాలలో జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్, పట్టణ పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, టౌన్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ కుశలవ, సిబ్బంది సైదులు, మహేష్ పాల్గొన్నారు.

అభ్యర్థులు.. కసరత్తులు

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ

- అభ్యర్థుల ఎంపికలో తలమునకలైన ప్రధాన పార్టీలు
- ఆశావహుల నుంచి ఇప్పటికే దరఖాస్తులను స్వీకరించిన కాంగ్రెస్
- ఒక్కో నియోజకవర్గానికి ముగ్గురి పేర్లను సూచించిన పీఏసీ సభ్యులు
- బీఆర్ఎస్, బీజేపీలోనూ ఎంపిక ప్రక్రియ వేగవంతం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో అభ్యర్థుల ఎంపిక కసరత్తును కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు వేగవంతం చేశాయి. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. దరఖాస్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురి పేర్లను పంపాలని పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ(పీఏసీ) సభ్యులను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆదేశించగా బుధవారమే వారు అభ్యర్థుల వివరాలను అధిష్టానానికి పంపించారు. బీఆర్ఎస్ పార్టీ కూడా నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి దీటైన అభ్యర్థులను నిలబెట్టి రెండు స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఓడిపోయిన అభ్యర్థులను పోటీలో నిలుపకుండా కొత్తవారిని బరిలోకి తీసుకొస్తే కాంగ్రెస్‌కు చెక్ పెట్టగలుగుతామా అనే ఆలోచనలో అధినేత ఉన్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నల్లగొండ జిల్లా నుంచే ప్రారంభించే ఆలోచన చేశారు. కృష్ణా ప్రాజెక్టుల పరిరక్షణ అంశంపై నల్లగొండలో ఈ నెల 13న బీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. కృష్ణా ప్రాజెక్టులను కాంగ్రెస్ పార్టీ కేంద్రానికి అప్పజెప్పడం వల్ల జిల్లాకు తీవ్ర నష్టం వాటిల్లబోతోందనే వాదనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా పార్లమెంట్ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోవాలనే వ్యూహంతో ముందుకు సాగుతోంది. అయితే, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డికి నల్లగొండ, భువనగిరిలో ఎక్కడి నుంచి టికెట్ ఇచ్చినా పోటీ చేస్తామని గతంలోనే పేర్కొన్నారు. భువనగిరి స్థానం బిక్షమయ్యగౌడ్, పైళ్ల శేఖర్‌రెడ్డి కూడా అడుగుతున్నారు. కొత్త వారికి టికెట్ ఇచ్చే యోచనలో కేసీఆర్ ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి ఎవరిని పోటీలో నిలుపతారనేది ఆసక్తికరంగా మారింది.

భువనగిరి నుంచి భారీగా..

భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ నేతలు 28 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి సూర్య పవన్‌రెడ్డి, పున్నా కైలాష్‌నేత, చెవిటి వెంకన్న, బండ్రు శోభారాణి, తీన్మార్ మల్లన్న, శివ నాగిరెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కూడా మరో జాబితాను అధిష్టానానికి పంపించింది. అధిష్టానం ఈ రెండు నియోజకవర్గాల్లో ఎవరి పేర్లను ఖరారు చేస్తుందో వేచి చూడాల్సిందే.

నల్లగొండకు కాంగ్రెస్ నుంచి 9 దరఖాస్తులు

నల్లగొండ లోక్‌సభ స్థానానికి పోటీ చేసేందుకు కాంగ్రెస్‌లో 9 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డి, సూర్యాపేటకు చెందిన పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుమారుడు సర్వోత్తంరెడ్డి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డితో పాటు యరగాని నాగన్న, ఎలగందుల రాము, వల్లి నారాయణరెడ్డి, పాశం నర్సిరెడ్డి, సాముల జైపాల్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులు ఉన్నాయని ప్రచారం సాగుతుండగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూతురు శ్రీనిధిరెడ్డి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారన్న చర్చ సాగుతోంది. ఆమె మాత్రం దరఖాస్తు చేసుకోలేదు. అధిష్టానం తలుచుకుంటే దరఖాస్తు చేసుకోకున్నా టికెట్ ఇవ్వవచ్చు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ.. మా కుటుంబ సభ్యులెవరూ పోటీ చేయరని, ఒక వేళ అధిష్టానం ఆదేశిస్తే చేస్తారని ప్రకటించారు. కోమటిరెడ్డి కుటుంబ సభ్యులు పోటీకి సిద్ధంగా లేకపోతే నల్లగొండ టికెట్ విషయంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్ణయమే కీలకం కానుంది.

బీజేపీ నుంచి కూడా..

బీజేపీలో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి ఆరుగురు ఆశావహులు పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పార్టీ ముఖ్య నేతలను కలిసి తమకు టికెట్ ఇవ్వాలని విన్నవించుకున్నారు. ఇందులో పెరిక సురేష్, గార్లపాటి జితేంద్రకుమార్, బండారు ప్రసాద్, నూకల నర్సింహారెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అయితే టికెట్ ఎవరికి ఇస్తే.. ఎలా ఉంటుందనే అంశంపై బీజేపీ నల్లగొండలో అభిప్రాయ సేకరణ చేసింది. గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నల్లగొండ నియోజకవర్గం పరిధిలోని మండల స్థాయి నేతల అభిప్రాయాలను తీసుకుంది. రాష్ట్ర పార్టీ పరిశీలించిన అనంతరం అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం ఉంది. ఇక, భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు టికెట్ ఆశిస్తున్నారు.

తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లా ఓటర్లు ఇలా....

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
హుజూర్‌నగర్	1,21,523	1,28,709	17	2,50,249
కోదాడ	1,19,431	1,25,902	17	2,45,350
సూర్యాపేట	1,18,630	1,24,428	13	2,43,071
తుంగతుర్తి	1,28,392	1,29,771	7	2,58,170
మొత్తం	4,87,976	5,08,810	54	9,96,840

ఓటర్లు 9,96,840 మంది

తుది జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం

- నాలుగు నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికం



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా ఓటర్ల లెక్క తేలింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం అనంతరం తుదిజాబితాను ప్రకటించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 9,96,840 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 4,87,976 మంది, మహిళా ఓటర్లు 5,08,810 మంది, ఇతరులు 54 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు 20,834 మంది ఎక్కువగా ఉన్నారు. అదే విధంగా అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గంలో 2,58,153 మంది , అత్యల్పంగా సూర్యాపేట నియోజకవర్గంలో 2,43,071 మంది ఓటర్లు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం–2024లో భాగంగా తుది ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావు శనివారం విడుదల చేశారు. ఈ జాబితాను కలెక్టర్ కార్యాలయం, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి రిటర్నింగ్ అధికారులైన ఆర్డీఓ కార్యాలయాలు, జిల్లాలోని ఆయా తహసీల్దార్ కార్యాలయాలతో పాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించనున్నారు. అలాగే బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ)ల వద్ద కూడా జాబితాను అందుబాటులో ఉంచనున్నారు.

కొత్తగా నమోదైన ఓటర్లు 5,892

అసెంబ్లీ ఎన్నికల అనంతరం లోక్‌సభ ఎన్నికల కసరత్తులో భాగంగా ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం 2024 జనవరి 5న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశారు. ముసాయిదా జాబితాతో పోల్చితే జిల్లాలో 5,892 మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. తుది జాబితా ప్రకారం జిల్లాలో 9,96,840 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,50,249మంది ఓటర్లు, కోదాడ నియోజకవర్గంలో 2,45,350 ఓటర్లు, సూర్యాపేట నియోజకవర్గంలో 2,43,071 ఓటర్లు, తుంగతుర్తి నియోజకవర్గంలో 2,58,170 ఓటర్లు మంది ఉన్నారు. నాలుగు నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

అధికారుల సన్నాహాలు

లోక్ సభ ఎన్నికలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 5 నుంచి 1,867 వీవీ ప్యాట్లు, 2,811 బ్యాలెట్ యూనిట్లు, 1,747 కంట్రోల్ యూనిట్ల ఎఫ్ఎల్‌సీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 14 వరకు కొనసాగనుంది. షెడ్యూల్ విడుదలైన తరువాత ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేని వాటిని పోలింగ్ కేంద్రాలకు పంపిస్తారు.

ప్రతి కేంద్రంలో 1,500మంది ఉండేలా..

ప్రతి పోలింగ్ కేంద్రంలో 1,500 మంది ఓటర్లు ఉండాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. కొన్ని కేంద్రాల్లో 1,500 మంది ఓటర్లకు తక్కువగా, మరికొన్ని చోట్ల అంతకుమించి ఉన్నారు. ఎక్కువ మంది ఉన్న కేంద్రాల ఓటర్లను సమీప కేంద్రంలో విలీనం చేయడమా? లేక కొత్తగా మరో కేంద్రాన్ని ప్రతిపాదించడమా? అనే విషయాన్ని అధికారులు పరిశీస్తున్నారు.

మూడు శాఖల అధికారుల బదిలీలపై..

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మూడు శాఖల అధికారుల బదిలీలపై కేంద్ర ఎన్నికల సంఘం నజర్ పెట్టింది. రెవెన్యూ, పోలీస్,ఆబ్కారీ శాఖల్లో మూడేళ్ల పాటు ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని ఆదేశించింది. దీంతో బదిలీకి అర్హులైన వారి వివరాలు సేకరించి అధికారులకు నివేదించారు.

మానవాళి అభివృద్ధికి సైన్స్ దోహదం



గెలుపొందిన బహుమతులతో విద్యార్థులు, అధికారులు

సూర్యాపేటటౌన్ : మానవాళి అభివృద్ధికి సైన్స్ ఎంతగానో దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుస్థిరాభివృద్ధికి సైన్స్ అనే ప్రధానంశంగా నిర్వహించిన చిత్రలేఖనం, పాటలు, ఉపన్యాసం, కవితల పోటీలను డీఈఓ ప్రారంభించి మాట్లాడారు. బాల్య దశలోనే విద్యార్థులను విజ్ఞానం వైపు మళ్లించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు ఈ నెల 28న జాతీయ సైన్స దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ కాస్ట్ అధికారి వి.వెంకటేశ్వర్‌రావు, జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజు, సీహెచ్.రామలింగారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఉపన్యాసంలో ప్రథమ సీహెచ్.కీర్తి(జెడ్పీహెచ్‌ఎస్ జీ సూర్యాపేట), ద్వితీయ డి.దీవెన(కేజీబీవీ మునగాల), తృతీయ ఎస్‌కె.నజ్మీన్(జెడ్పీహెచ్‌ఎస్ నడిగూడెం), కవితల పోటీల్లో కె.శ్రవణ్‌కుమార్(జెడ్పీహెచ్‌ఎస్ ఏనుభాముల), జె.సరోజిని, సీహెచ్.నందిని(జెడ్పీహెచ్‌ఎస్ బేతవోలు), పాటల పోటీల్లో ప్రథమ జి.ఐశ్వర్య(కేజీబీవీ జాజిరెడ్డిగూడెం), ద్వితీయ ఎన్.జోలాకృతి(ఎంఎస్‌ఆర్ స్కూల్), బి.సంతోష్(నాగారం), చిత్రలేఖనం పోటీల్లో ప్రథమం జి.సిద్ధార్థ్ సాహు(జయ సూర్యాపేట), ద్వితీయ బి.సౌమ్య(జెడ్పీహెచ్‌ఎస్ నూతనకల్), జె.శివ(జెడ్పీహెచ్‌ఎస్ టేకుమట్ల)లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.

పంట రుణాలకు ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో పంట రుణాలకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు బ్యాంక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎల్‌డీఎం సీహెచ్. బాపూజీ అధ్యక్షతన నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ) సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు పంట రుణాలు ఇవ్వాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణాల లక్ష్యం రూ.2614.67కోట్లు కాగా ఇప్పటివరకు రూ.2567.55 కోట్లు ఇచ్చామని, వ్యవసాయ టర్మ్ లోన్ల లక్ష్యం రూ. 1363.93 కోట్లకు రూ. 1416.43 కోట్లు, వ్యవసాయ రుణాల్లో రూ. 3978.6 కోట్లకు రూ. 3983.98 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ. 589.52 కోట్లకు రూ. 526.58 కోట్లు ఇచ్చామన్నారు. 2024–25 సంవత్సరానికి నాబార్డ్ వార్షిక ప్రణాళిక బుక్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ ఎల్‌డీఓ వైభవ్ వ్యాస్, ఎస్‌బీఐ ఏజీఎం జ్యోతి, నాబార్డ్ జీఎం సత్యనారాయణ, ఏపీజీవీబీ ఏజీఎం ఆశాలత, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీఏఓ రామారావు నాయక్, పరిశ్రమలశాఖ జీఎం తిరుపతయ్య, డీఈఓ అశోక్, అధికారులు జ్యోతి పద్మ, మాధవ రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

29లోపు సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై చర్యలు

ఈనెల 29వ తేదీలోపు 2022–23 వానాకాలం, యాసంగి సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్. వెంకట్రావు హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిలతో కలిసి కస్టమ్ మిల్లింగ్ రైస్‌పై సివిల్‌సప్లయ్ అధికారులు, మిల్లర్లతో సమీక్షించి మాట్లాడారు. 2022 –23 వానాకాలం సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ 88శాతం పూర్తయ్యిందని, మరో 12శాతం పెండింగ్ ఉందన్నారు. 7 మిల్లుల్లో పెండింగ్ ఉందని, వాటిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రాంపతినాయక్, మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సోమనర్సయ్య, మిల్లర్లు పాల్గొన్నారు.



నాబార్డు వార్షిక ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

సూర్యాపేట : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో మౌలిక వసతులు, అత్యవసరంగా కావాల్సిన పరికరాలు సమకూర్చాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారని, అందుకనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. పీహెచ్‌సీల్లో మీటింగ్ హాళ్లు, డాక్టర్లు, స్టాఫ్‌నర్సులకు విశ్రాంతి గదులు, వ్యాక్సిన్ నిల్వచేయడానికి ఐఎల్‌ఆర్ రూమ్స్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో ఉపాధి హామీ కాంపోనెంట్ నిధులతో కాంపౌండ్‌వాల్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. సమావేశంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ శారద, డీఎంహెచ్‌ఓ కోటాచలం, జీజీఎస్ సూపరింటెండెంట్ మురళీధర్ రెడ్డి, డీసీహెచ్ ఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈవీఎంల చెకింగ్ జాగ్రత్తగా చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ జాగ్రత్తగా చేయాలని కలెక్టర్, ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావు ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంలో కొనసాగుతున్న ఎఫ్ఎల్‌సీని ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంకతో కలిసి ఆయన గురువారం తనిఖీ చేసి మాట్లాడారు. ఓటింగ్ యంత్రాలు చెకింగ్ పూర్తి చేసి నిర్దేశించిన సమయానికి అందించాలని సంబంధిత ఇంజనీర్లు, సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల విభాగం సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ ఈవీఎం గోదాంలో పోలీసులు పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీకి రూ. 20.73 లక్షలు

- జిల్లాలో 22 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధుల కేటాయింపు
- ఆధునిక వసతుల కల్పనకు వినియోగం

PM SHRI
PM SchOols for Rising India

సూర్యాపేటటౌన్ : ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం కింద జిల్లాకు రూ.20.73లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో జిల్లాలో ఎంపికైన 22 పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఐదేళ్ల పాటు ఈ పథకాన్ని కొనసాగిస్తూ విడతల వారీగా వసతుల కల్పనకు రూ.కోటి వరకు నిధులు వెచ్చించనున్నారు. జిల్లాలో 950 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో జిల్లా నుంచి 22 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ విద్యా సంవత్సరానికి రూ.20,73,963 విడుదల చేస్తూ జనవరి 31న పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంల ఖాతాలో జమ అయ్యాయి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కొన్ని పాఠశాలలకు రూ.75వేలు, కొన్ని పాఠశాలలకు రూ.99,399 విడుదల చేశారు.


ఆధునిక సాంకేతిక విద్య అందించేందుకు...

ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక వనరులు సమకూర్చుతారు. మరుగుదొడ్లు, గ్రంథాలయాలు, సౌరవిద్యుత్ ఏర్పాటు, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడం, శుద్ధజలం అందించడం, క్రీడలను ప్రోత్సహించడంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తారు. విద్యార్థుల్లో భాషాపరమైన లోపాలను సరిదిద్దుకోవడానికి అవసరమైన సాంకేతిక వనరులను వినియోగించుకునేలా ప్రోత్సహిస్తారు. ఎంపికైన పాఠశాలల్లో సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తెస్తారు. ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలను అన్ని తరగతి గదుల్లో ఏర్పాటు చేయించనున్నారు. పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో వసతుల కల్పన, అదనపు గదుల నిర్మాణం, విద్యార్థులకు ఇతరత్రా విషయాలపై అవగాహన కల్పించేందుకు ఈ నిధులను వెచ్చించనున్నారు.

ఎంపికైన పాఠశాలలు ఇవే..

ఆత్మకూర్.ఎస్ మండల కేంద్రంలోని టీఎస్‌ఎంఎస్, చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్, చింతలపాలెం మండలం కిష్టాపురం ఎంపీయూపీఎస్, చివ్వెంల జెడ్పీహెచ్‌ఎస్, గరిడేపల్లి మండలం గడ్డిపల్లి టీఎస్‌ఎంఎస్, హుజూర్‌నగర్ మండలంలోని అమరవరం ఎంపీపీఎస్, హుజూర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్, కోదాడ మండలం బీక్యాతండా ఎంపీయూపీఎస్, కోదాడ జెడ్పీహెచ్‌ఎస్, మట్టపల్లి టీఎస్‌ఎంఎస్, మేళ్లచెర్వు మండలం రామాపురం జెడ్పీహెచ్‌ఎస్, మునగాల టీఎస్‌ఎంఎస్, నడిగూడెం సోషల్ వెల్ఫేర్ పాఠశాల, నేరేడుచర్ల జెడ్పీహెచ్‌ఎస్, నూతనకల్ జెడ్పీహెచ్‌ఎస్, పెన్‌పహాడ్ టీఎస్‌ఎంఎస్, సూర్యాపేటలోని తెలంగాణ సోషల్ వేల్ఫేర్ జూనియర్ కళాశాల, సూర్యాపేట జెడ్పీ బాలుర పాఠశాల, తిరుమలగిరి మండలం ఎస్సీ కాలనీతండా ఎంపీపీఎస్, తిరుమలగిరి టీఎస్‌ఎంఎస్, తుంగతుర్తి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హై స్కూల్ పీఎంశ్రీ పథకానికి ఎంపికయ్యాయి.

పాఠశాలల అభివృద్ధికి వాడుకోవచ్చు



పీఎంశ్రీ నిధులను ఎంపికైన పాఠశాలల అభివృద్ధికి వాడుకోవచ్చు. మౌలిక వసతుల కల్పన, చాక్ బోర్డు, ఇతర అవసరాలకు వాడుకోవచ్చు. పాఠశాలలను అన్ని వసతులతో తీర్చిదిద్దేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయి.

–అశోక్, డీఈఓ

క్లుప్తంగా

మహిళా కార్యదర్శిని దూషించిన ఎంపీడీఓ

- సామాజిక మాధ్యమాల్లో ఆడియో వైరల్

గుండాల: గుండాల మండలంలో పనిచేస్తున్న మహిళా పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీఓ జి.శ్రీనివాసులు అసభ్య పదజాలంతో దూషించిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, అభివృద్ధి పనుల అంశాలను పంచాయతీ కార్యదర్శులకు అధికారికంగా గ్రూపుల్లో పంపిన నివేదికను సదరు కార్యదర్శి ప్రజా ప్రతినిధులకు పంపిందనే నెపంతో దుర్భాషలాడినట్లు ఆడియో వైరల్ అయింది. ఈ విషయంపై ఎంపీడీఓను వివరణ కోరగా సస్పెండ్ అయిన ఎంపీఓ తనను బదనాం చేసేందుకే ట్యాంపరింగ్ చేసి గ్రూపుల్లో ఆడియోను వైరల్ చేశాడని చెప్పారు.

నిప్పంటించడంతో మొక్కలు దగ్ధం



మరిపడిగ రోడ్డు వెంట దగ్ధమైన మొక్కలు

గుండాల: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గుండాల మండలంలోని మరిపడిగ గ్రామ బీటీ రోడ్డు వెంట నాటిన మొక్కలు గురువారం పూర్తిగా దగ్ధమయ్యాయి. మొక్కలకు నిప్పంటించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

మద్యం సేవించి విధులకు హాజరైన ఎగ్జామినర్

దేవరకొండ: మద్యం సేవించి ఇంటర్ ప్రాక్టికల్స్ విధులకు ఓ ఎగ్జామినర్ హాజరయ్యాడు. గురువారం దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. కళాశాలలో గురువారం మధ్యాహ్నం సమయంలో భోజనానికి వెళ్లి వచ్చిన ఎగ్జామినర్ మద్యం సేవించి ఫిజిక్స్ ప్రాక్టికల్ పరీక్షల విధులకు హాజరయ్యాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు ప్రిన్సిపాల్ మల్లయ్యకు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ పరీక్ష గదికి చేరుకొని ఎగ్జామినర్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు యథావిధిగా కొనసాగించేందుకు మరో ఎగ్జామినర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట విద్యార్థి సంఘాల నాయకులు బుడిగ వెంకటేశ్, వంగూరి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

అసెంబ్లీలో మనోళ్లు



తొలిరోజు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి కోమటిరెడ్డి




సహచర ఎమ్మెల్యేలతో సమావేశానికి హాజరయ్యేందుకు వస్తున్న సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



సమావేశానికి వస్తున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య







అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

హైవే వెంట డీజిల్ దొంగలు

- నిలిపి ఉంచిన లారీల నుంచి డీజిల్ చోరీ
- ఒక్కరోజే మూడు లారీల్లో 540లీటర్ల డీజిల్ అపహరణ
- పోలీసులకు డ్రైవర్ల ఫిర్యాదు



లారీ డీజిల్ ట్యాంక్ మూతను పగులగొట్టిన గుర్తుతెలియని దుండగులు

సూర్యాపేట క్రైం: హైవే వెంట నిలిపి ఉంచిన లారీల నుంచి కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్‌ను అపహరించారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున సూర్యాపేట పట్టణంలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై గల అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో చోటుచేసుకుంది. సూర్యాపేట పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో మూడు లారీలను నిలిపి ఉంచి డ్రైవర్లు నిద్రలోకి జారుకున్నారు. కొంతమంది దుండగులు డీజిల్ ట్యాంక్ తాళాలను పగులగొట్టి సుమారు 540 లీటర్ల డీజిల్‌ను చోరీ చేశారు. ఉదయం సమయంలో తమ లారీలను స్టార్ట్ చేయగా.. ఎంతసేపటికి స్టార్ట్ కాకపోవడంతో డీజిల్ ట్యాంక్ వద్దకు వెళ్లి చూడగా ఒక్కసారిగా షాక్ అయ్యారు. కొద్ది దూరంలో ఉన్న మరో రెండు లారీల్లో కూడా ఇదే విధంగా జరగడంతో డీజిల్ చోరీకి గురైందని గ్రహించి, సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడులారీల్లో నుంచి పెద్ద ఎత్తున డీజిల్ చోరీకి గురికావడంతో డ్రైవర్లు ఆవేదనకు గురయ్యారు.

డ్రైవర్లు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో..

గుర్తుతెలియని వ్యక్తులు వాహనాల నుంచి డీజిల్‌ను మాయం చేసి బంకుల్లో, లూజ్‌గా గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తూ ఈజీ మనీకి అలవాటుపడుతున్నారు. డ్రైవర్లు కాసేపు విశ్రాంతి తీసుకుందామని తమ లారీలను జాతీయ రహదారులపై, పెట్రోల్ బంకుల్లో, రహదారుల వెంట పక్కకు నిలిపిన సమయంలో డీజిల్ ట్యాంకుల్లో నుంచి డీజిల్‌ను దొంగలిస్తున్నారు. పదిహేను రోజుల క్రితం సూర్యాపేట మండలంలోని రాయినిగూడెంలో జాతీయ రహదారి పక్కన దాబా హోటల్ ముందు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రెండు లారీలను ఆపుకొని డ్రైవర్లు నిద్రపోయారు. ఆ లారీల నుంచి సుమారు 380కి పైగా లీటర్ల డీజిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆ సమయంలో హోటల్ నిర్వాహకులకు , లారీ డ్రైవర్ల మధ్య ఘర్షణ నెలకొంది. సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు రూరల్ మండలాల్లోని జాతీయ రహదారులపై ఇలా వరుసగా లారీల నుంచి డీజిల్ చోరీకి గురవుతుండడంతో లారీల డ్రైవర్లు బెంబేలెత్తిపోతున్నారు. సూర్యాపేట పోలీసులు ఈ విషయంపై దృష్టిసారించి పెట్రోలింగ్‌ను మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

పెట్రోలింగ్ పెంచుతాం

> జాతీయ రహదారులపై పెట్రోలింగ్‌ను మరింతగా పెంచుతాం. ఇటీవల లారీల్లోని డీజిల్ ట్యాంకర్లలో డీజిల్‌ను దొంగలిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై దృష్టి సారించాం. ఇలాంటి ఘటనలకు పాల్పడే దొంగలను త్వరలోనే పట్టుకుంటాం. వాహనదారులు భయపడాల్సిన అవసరం లేదు.
>
> – రాజశేఖర్, సీఐ, సూర్యాపేట

ఏసీబీకి పట్టుబడిన ఆర్ఐ



నగదుతో పట్టుబడిన ఆర్ఐ పల్లా శ్రీనివాస్‌రెడ్డి

కొండమల్లేపల్లి(దేవరకొండ): కొండమల్లేపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) పల్లా శ్రీనివాస్‌రెడ్డి ఓ రైతు వద్ద లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి నల్లగొండ జిల్లా ఏసీబీ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలంలోని కేశ్యతండాకు చెందిన బాణావత్ లచ్చు పౌతి రిజిస్ట్రేషన్ చేయాలని రెండు నెలల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. లచ్చు పెద్దమ్మ, పెద్దనాన్న అయిన బాణావత్ మంగ్లీ, హన్మా పేరిట కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామంలోని సర్వే నెం.63/4లో ఒక ఎకరం భూమి ఉంది. అయితే, కొన్నాళ్ల కిందట మంగ్లీ, హన్మాలు చనిపోవడంతో వారి కుమార్తెల అంగీకారంతో ఒక ఎకరం భూమిని పౌతి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు లచ్చు ఆర్ఐ పల్లా శ్రీనివాస్‌రెడ్డిని సంప్రదించాడు. పౌతి రిజిస్ట్రేషన్ తాను చేయిస్తానని, అందుకు రూ.60వేలు కావాలని ఆర్ఐ డిమాండ్ చేశాడు. చివరికి రూ.30వేలకు అంగీకారం కుదిరింది. ఈ క్రమంలోనే గురువారం దేవరకొండ పట్టణంలోని డిండి చౌరస్తాలో లచ్చు నుంచి ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి రూ.30వేలు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆర్ఐపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే సెల్. 9154388918, 9154388920, 9154388921తో పాటు టోల్ ఫ్రీ నం.1064కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ వెంట ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్రావ్, డి.రామారావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీధర్ పాల్గొన్నారు.

డీ- 22 గేటు ధ్వంసం



గేటు స్క్రూరాడ్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గుర్రంపోడు: మండలంలోని ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వపై పిట్టలగూడెం వద్ద డీ- 22 గేటును బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బలవంతంగా ఎత్తడంతో గేటు స్క్రూ రాడ్ ధ్వంసమైంది. అడ్డుకోబోయిన లష్కర్‌లపై రాళ్లదాడి చేయడంతో వారు అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఉదయమే గేటు వద్దకు చేరుకున్న అధికారులు లష్కర్‌లు, సాంకేతిక సిబ్బంది గేటుకు మరమ్మతు చేసి కిందకు దించారు. అయితే.. తాగునీటి అవసరాలకు పానగల్ ఉదయ సముద్రం నింపేందుకు నీటిని విడుదల చేస్తుండగా ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితుల వల్ల పంట పొలాలకు నీటిని మళ్లించుకొనేందుకు రైతులు ప్రయత్నిస్తుండడం సమస్యగా మారింది. ఈనేపథ్యంలో గేట్లను రాత్రి వేళ ఎత్తకుండా పోలీసుల గస్తీ ఏర్పాటు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నతాధికారులను కోరారు.

30క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చౌటుప్పల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. తుర్కపల్లి మండలం గుజ్జువానికుంటతండాకు చెందిన గుగులోతు అశోక్(21) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ రేషన్ బియ్యం వ్యాపారం నిర్వహిస్తున్నాడు. బుధవారం సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామాల్లో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. ఈ బియ్యాన్ని 65బస్తాలలో నింపి ఆటోలో వేసుకొని గురువారం హైదరాబాద్‌కు బయలుదేరాడు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కన్పించడంతో ఆటోను ఆపి, రేషన్ బియ్యం గుర్తించి, అశోక్‌ను అదుపులోకి తీసుకున్నారు. బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

భువనగిరిలో 10 క్వింటాళ్లు..

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని సమ్మద్ చౌరస్తా సమీపంలో గురువారం 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు తుర్కపల్లి మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన చందు నాయక్‌ను అదుపులోకి తీసుకుని పీడీఎస్ బియ్యాన్ని పట్టణ పోలీసులకు అప్పగించారు.

హుజూర్‌నగర్‌లో 21 క్వింటాళ్లు..

హుజూర్‌నగర్ : అక్రమంగా నిల్వ చేసిన 21 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసిన సంఘటన హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. గురువారం ఏఎస్ఐ లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మల్లన్న నగర్ కాలనీకి చెందిన తాండ్రకొండ కోటేశ్వరరావు ఇంట్లో పీడీఎస్ బియ్యం నిల్వ చేశారనే సమాచారం మేరకు శుక్రవారం రాత్రి అతని ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో 21 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ముగ్గురిపై వీధి కుక్కల దాడి



గాయపడిన బాలుడు

భువనగిరిటౌన్: భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో వీధికుక్కలు బీభత్సం సృష్టించాయి. గురువారం కాలనీలోని ఇద్దరు మహిళలతో పాటు ఓ చిన్నారిపై దాడి చేసి గాయపరిచాయి. అంగన్‌వాడీ టీచర్ ఉడుత నవత, పారిశుద్ధ్య కార్మికురాలు అండాలు కాలిని గాయపరచగా.. జగదీశ్ కుమారుడు మూడేళ్ల బాలుడు పూర్విక్‌రాంకు చేతికి గాయమైంది. క్షతగాత్రులను భువనగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. భువనగిరి, మండల పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువైపోయిందని, దీనిని నివారించాలని వారు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

మాడుగులపల్లి : క్రిమిసంహారక మందు తాగి చికిత్స పొందుతున్న వృద్ధురాలు గురువారం మృతి చెందింది. మాడుగులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన పెంటమ్మ(80) కుమారులు ఆదరించడం లేదని మనస్తాపంతో భర్త లింగయ్య (82)తో కలిసి ఈ నెల 5వ తేదీన పురుగుల మందు తాగింది. అదేరోజు లింగయ్య మృతి చెందగా అపస్మారక స్థితిలో ఉన్న పెంటమ్మను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ప్రాణాలు కోల్పోయింది. కుమార్తె పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

జింక కళేబరం లభ్యం

నాగార్జునసాగర్: తిరుమలాయ గట్టు సమీపంలో గురువారం తెల్లవారుజామున జింక కళేబరం లభ్యమైంది. అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన జింకను వీధికుక్కలు వెంట పడి హతమార్చినట్లు అటవీ అధికారులు గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అధికారులు జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఫోక్సో కేసులో నిందితునికి 11 ఏళ్ల జైలు

చివ్వెంల(సూర్యాపేట) : ఫోక్సో కేసులో నిందితునికి 11 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా కోర్టు స్పెషల్ సెషన్స్ జడ్జి, ఫోక్సో కోర్టు జడ్జి ఎస్.అమరావతి గురువారం తీర్పు వెల్లడించారు. 2022 సంవత్సరంలో సూర్యాపేటకు చెందిన ఓ మైనర్ బాలికను పట్టణానికి చెందిన కుడిమళ్ల ఈశ్వర్ తనను ప్రేమించాలని వేధించాడు. ఈ క్రమంలో ఆ బాలిక అదే సంవత్సరం ఏప్రిల్ 10న తన పెద్దనాన్న కూతురుతో కలిసి కిరాణ షాపు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఈశ్వర్ వచ్చి ఆమె చెయ్యి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఎస్ఐ ఇ.సైదులు కేసు నమోదు చేసి నిందితుని రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి.. పీపీ కాకి రాంరెడ్డి వాదనలతో ఏకీభవిస్తూ నిందితునికి పదకొండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.15 వేలు జరిమానా విధించారు. పీపీకి లైజన్ ఆఫీసర్ గంప శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ కృష్ణ సహకరించారు.

గీత కార్మికుడికి గాయాలు

ఆత్మకూర్ (ఎస్) : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి వ్యక్తికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని ఏనుబాముల గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పసునూరి లక్ష్మయ్య రోజువారీగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలిజారింది. ఈ ఘటనలో లక్ష్మయ్యకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మర్రిగూడ: మండల కేంద్రంలో గురువారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మర్రిగూడ పరిధిలోని తూర్పుతండాకు చెందిన జర్పుల చాంద్ హైదరాబాద్ నుంచి మర్రిగూడకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. మాల్ నుంచి మర్రిగూడ ఆదర్శ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థుల ద్విచక్రవాహనం చాంద్ బైక్‌ను ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మాల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదశాత్తు గడ్డివాము దగ్ధం

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని 18వవార్డు గణేష్‌నగర్‌లో గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని 400మోపుల గడ్డివాము దగ్ధమైంది. గణేష్‌నగర్‌కు చెందిన మండగడప లక్ష్మి రూ.50వేల విలువైన గడ్డిని వాముకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. స్థానిక కౌన్సిలర్ కర్రి శివసుబ్బారావు వెంటనే స్పందించి ఫైర్ సిబ్బందికి ఫోన్‌చేయగా వారు వచ్చి మంటలను అదుపుచేసే సమయానికే గడ్డిమొత్తం కాలిపోయింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు లక్ష్మి కోరారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇప్పలగూడెంలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన సుత్తి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గురువారం నల్లగొండ ఇన్‌చార్జ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ ఎస్పీ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. ఇప్పలగూడెం గ్రామానికి చెందిన వంటల సైదులు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మోదాల శ్రవణ్‌కుమార్ వద్దకు కూలీ కోసం సైదులు తరచుగా వెళ్లేవాడు. శ్రవణ్‌కుమార్‌కు వ్యవసాయ భూమితో పాటు పశు సంపద ఉంది. సైదులు తన భార్యతో సన్నిహితంగా ఉంటున్నాడని శ్రవణ్‌కుమార్ అనుమానించాడు. దీంతో తన బావమరుదులైన సూర్యాపేట వాసులు బండారి వెంకటేశ్వర్లు, బండారి సాయిలను సంప్రదించి సైదులును హత్య చేయాలని పథకం పన్నారు. సైదులు ఈ నెల 3న ఇప్పలగూడెంలో ఓ బెల్టు షాపు వద్ద మద్యం తాగడాన్ని బండారు సాయి గమనించి బావ శ్రవణ్‌కుమార్, సోదరుడు బండారు వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చాడు. దీంతో ముగ్గురు కలిసి గ్రామం వెలుపల ఉన్న ఐకేపీ సెంటర్ ఆవరణలోకి మద్యం తాగేందుకు తీసుకెళ్లారు. ముగ్గురు కలిసి సైదులుకు మద్యం తాగించి, తన భార్య వెంట ఎందుకు పడుతున్నావని నిలదీశారు. అతడి తలపై వ్యవసాయ పనిముట్లకు వాడే సుత్తితో మోది హత్య చేశారు. కేసును ఛేదించిన సీఐ రాఘరావు, కేతేపల్లి ఎస్ఐ శివతేజ, సిబ్బందిని ఏఎస్ఐ అభినందించారు.

సాగర్‌ను సందర్శించిన రీసెర్చ్ స్కాలర్స్



బుద్ధుడి పాదాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థన చేస్తున్న రీసెర్చ్ స్కాలర్స్

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌ను గురువారం ముంబైకి చెందిన సోమయ్య విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్స్ సందర్శించారు. తెలంగాణ టూరిజం, యూత్ సర్వీసెస్, పురావస్తుశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, శైలజ రామయ్యర్ సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో వారు పర్యటించారు. విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్స్ పురాతన బౌద్ధ, జైన, హిందూ శిల్పకళలపై రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వారు పర్యటిస్తున్నారు. పురావస్తుశాఖతో సంయుక్తంగా పరిశోధనలు, తవ్వకాలు జరిపే పరిశోధనాత్మక ప్రక్రియలో భాగస్వామ్యం కావడానికి ఇటీవల ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని బౌద్ధశిల్పాలపై పరిశోధన మేరకు ఫణిగిరి, గాజులబండ మొదలగు బౌద్ధప్రాంతాలను సందర్శించి, నాగార్జునసాగర్‌కు చేరుకున్నారు. బుద్ధవనం ప్రాజెక్టును అధ్యయనం చేశారు. వీరితో పాటు రాష్ట్ర పురావస్తుశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ మల్లునాయక్, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభచారి, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'నవోదయ' ప్రవేశ పరీక్ష

- 9వ తరగతికి నల్లగొండ జిల్లాలో నాలుగు కేంద్రాలు
- 11వ తరగతికి సూర్యాపేట జిల్లా కేంద్రంలో 9 పరీక్షా కేంద్రాలు
- పరీక్షా సమయం రెండున్నర గంటలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



జవహర్ నవోదయ విద్యాలయం

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–28 విద్యా సంవత్సరానికి 9వ, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం గురువారం తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షను నల్లగొండ జిల్లా కేంద్రంతో పాటు చలకుర్తి జేఎన్‌వీలోనూ, 11వ తరగతి ప్రవేశానికి నిర్వహించే పరీక్షా కేంద్రాలను సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

9వ ప్రవేశ పరీక్ష

తొమ్మిదవ తరగతిలో ఖాళీగా ఉన్న 7 సీట్లకుగాను ప్రవేశ పరీక్ష నిర్వహణకు మొత్తం 4 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,267 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఒక్కో సీటుకు 181 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. పరీక్షా కేంద్రాలను నాలుగు కేంద్రాల్లో సెయింట్ ఆల్ఫోన్సెస్ హైస్కూల్ నల్లగొండ (360 మంది), నల్గొండ పబ్లిక్ స్కూల్ మీర్‌బాగ్ కాలనీ, నల్లగొండ(360), పెద్దవూర మండలం చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలోనూ(312), ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, దేవరకొండ రోడ్ నల్లగొండ(235)లోనూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఉదయం 10:45 గంటలలోపే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, 11:45 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదు. పరీక్షా సమయం రెండున్నర గంటలు ఉంటుంది. ఉదయం 11:15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు ఉంటుంది. దివ్యాంగులకు అదనంగా మరో 50 నిమిషాలు సమయం ఇవ్వనున్నారు. ప్రశ్నపత్రంలో మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో హిందీ భాషకు 15 మార్కులు, ఇంగ్లీష్ బాషకు 15 మార్కులు, గణితం 35 మార్కులు, జనరల్ సైన్స్‌కు 35 మార్కులు ఉంటాయి.

11వ తరగతి పరీక్ష..

ప్రవేశ పరీక్షను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 9 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. మొత్తం 2126 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. సూర్యాపేటలో ఏవీఎం బాలికల ఉన్నత పాఠశాల(360), తెలంగాణ మోడల్ స్కూల్, ఇమాంపేట(360), ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2 వాటర్ ట్యాంకు పక్కన(192), కాకతీయ ఉన్నత పాఠశాల(240), సిటీ టాలెంట్ హైస్కూల్(240), ప్రభుత్వ(ఎంఏఎం) హైస్కూల్(192), సిద్దార్థ హైస్కూల్(216), జెడ్పీహెచ్ఎస్ బాలికల హైస్కూల్, మున్సిపల్ వాటర్ ట్యాంకు పక్కన(134) పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు 10:30 గంటలలోగా చేరుకోవాల్సి ఉంటుంది. 11 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రశ్నపత్రంలో మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో మెంటల్ ఎబిలిటీ 20 మార్కులు, ఇంగ్లిష్ భాషపై 20, సైన్స్‌పై 20, సోషల్ సైన్స్‌పై 20, గణితంపై 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులకు సూచనలు

హాల్‌టిక్కెట్లు లేని విద్యార్థులను పరీక్షకు అనుమతి ఉండదని, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతి లేదు. పరీక్షను బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో మాత్రమే ఓఎంఆర్ షీటులో రాయాల్సి ఉంటుంది. పెన్సిల్‌తో రాసిన సమాధానాలు చెల్లవని, ప్రతి ప్రశ్నకు ఏదో ఒకదానిని గుర్తించి ఓఎంఆర్ షీట్‌లో సర్కిల్‌ను నింపాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రశ్నపత్రంపైనా, ఓఎంఆర్ షీటుపైన విద్యార్థి తన రూల్ నంబర్‌ను విధిగా వేయాలని, ఓవర్ రైటింగ్, కొట్టివేతలు, దిద్దుళ్లు చేసినా, వైట్‌నర్ ఉపయోగించినా ఆ ఓఎంఆర్ షీటు చెల్లదని సూచించారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటాయని పేర్కొన్నారు.